
సాక్షి
కుమురం భీం

శనివారం : 31 : మే : 2025

I



మంచిర్యాల 'పాపికొండలు'

గోదావరి నదిలో ఏర్పడిన మొసళ్ల మడుగు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఎత్తయిన గుట్టలు, నిత్యం జలకళతో ఆహ్లాదం పంచుతోంది. IIలో▸



'ఇందిరమ్మ'.. ఇంకెప్పుడు?

ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హుల జాబితాను ఎంపీడీవోలు జిల్లా అధికారులకు అందించారు. అర్హుల జాబితా రాకపోవడంతో నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
36.6 /27.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అవతరణ అతిథులు వీరే..

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను జూన్ 2న అట్టహాసంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా జిల్లా కేంద్రాల్లో నిర్వహించే వేడుకల్లో పాల్గొనే ముఖ్య అతిథుల పేర్లు ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్‌లో వేడుకలకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సంక్షేమశాఖల ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, కుమురంభీం ఆసిఫాబాద్‌లో రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంచిర్యాలలో ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్స్ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, నిర్మల్‌లో వేడుకలకు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఆయా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించే వేడుకల్లో ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ బాలికల పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం, పీఎంఆర్పీలు, ఏటీడీవోలతో సమావేశం నిర్వహించారు. డీటీడీవో మాట్లాడుతూ జూన్ 6 నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయలు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. డ్రాపౌట్లను మళ్లీ స్కూళ్లలో చేర్పించాలని సూచించారు. సమావేశంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, ఏటీడీవోలు చిరంజీవి, డీఎస్‌వో మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు, పక్కన డీఈవో యాదయ్య

ఆసిఫాబాద్‌రూరల్: బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డీఈవో యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద హైదరాబాద్ ఆధ్వర్యంలో కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి శుక్రవారం హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతోపాటు మానవతా విలువలు కూడా నేర్పించాలన్నారు. మైనర్లకు వ్యక్తిగత పరిశుభ్రత, శారీరక పెరుగుదల మార్పులు, పర్యవసనాలు, బాల్యవివాహాల నిరోధం, లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం అందించే సదుపాయాల గురించి వివరించాలని సూచించారు. సైబర్ నేరాలపై లఘు చిత్రాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీసీడీవో భాగ్యలక్ష్మి, ప్రజ్వల స్టేట్ కోఆర్డినేటర్ మహ్మద్ సిరాజ్, అనిల్ పాల్గొన్నారు.

ఎస్పీఎం ఎన్నికలు నిర్వహించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో కార్మిక కమిషనర్ చంద్రశేఖరన్‌కు ఎస్పీఎం మజ్దూర్ యూనియన్(సీఐటీయూ ఈ2510) నాయకులు వినతిపత్రం అందించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపాల్ మాట్లాడుతూ ఎస్పీఎంలో నిలిపివేసిన కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రక్రియను తిరిగి ప్రారంభించాలన్నారు. కార్మిక సంఘం లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. కనీసం క్యాంటీన్ కూడా లేదని, ఉద్యోగ భద్రత లేక కార్మికులు భయంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ కూశన రాజన్న, వైస్ ప్రెసిడెంట్ ముంజం శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ కృష్ణమాచారి పాల్గొన్నారు.

పత్తి సాగుకు దహెగాం శివారులో సిద్ధం చేసిన దుక్కి



సాగు మొదలు..
సలహాలు కరువు

- జిల్లాలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' లేనట్లే..!
- కేవీకే లేకపోవడంతో ప్రారంభం కాని కార్యక్రమం
- వర్షాలతో విత్తనాలు విత్తేందుకు రైతులు సిద్ధం
- అవగాహన సదస్సులు నిర్వహించాలని విన్నపం

దహెగాం(సిర్పూర్): వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆధునిక సాగు పద్ధతులు, పంటల మార్పిడి, భూసారానికి అనుగుణంగా ఎలాంటి పంటలు సాగు చేయాలి.. తదితర విషయాలను శాస్త్రవేత్తల ద్వారా రైతులకు వివరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అన్ని జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుండగా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రం ఇప్పటికీ ప్రారంభించలేదు. ఓ వైపు రుతుపవనాలు చురుగ్గా కదులుతుండగా, వర్షాలతో రైతులు సాగు పనులు చేసుకుంటున్నారు. మరికొన్ని రోజుల్లో పత్తి విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి తరుణంలో అన్నదాతలు ఉపయోగకరమైన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

జిల్లాలో 4.45 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లావ్యాప్తంగా 15 మండలాల పరిధిలో 4.45 లక్షల ఎకరాల్లో సాగు భూమి ఉంది. 1.48 లక్షల మంది రైతులు ఉన్నారు. సాగునీటి సౌకర్యం లేక అన్నదాతలు అధికంగా వర్షాధారంగానే పంటలు పండిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టితో ఏటా పంటలు నష్టపోతున్నారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వంగడాలను ఎంచుకోకపోవడంతో అకాల వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. జిల్లా రైతులు ప్రధానంగా 3.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. వరి 58 వేల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీటి వనరులు లేకపోవడంతో పత్తి, జొన్న, కంది, సోయా తదితర పంటలు పండిస్తున్నారు.

రైతులకు అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సలహాలు, సూచనలు అందించడానికి రాష్ట్రవ్యాప్తంగా 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం ప్రారంభించింది. ఈ నెల 5 నుంచి జూన్ 13 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఆయా గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. యూరియా ఏ మోతాదులో వాడాలి.. పంట మార్పిడి, మందుల పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా ఆరు అంశాల గురించి వివరిస్తున్నారు. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలు వినియోగించి నేల తల్లిని ఆరోగ్యంగా ఉంచడం, రశీదులు భద్రపరచి పరిహారం పొందడం, సాగు నీటిని ఆదా చేసి భావితరాలకు అందించడం, పంట మార్పిడి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందడం, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడడం.. వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ముందుకు సాగని కేవీకే పనులు

జిల్లాలోని రైతులకు శాస్త్రీయ పద్ధతుల గురించి వివరించడం, నూతన వంగడాలను అందుబాటులోకి తెచ్చేందుకు ఈ ఏడాది జనవరిలో జిల్లాకు కృషి విజ్ఞాన కేంద్రం మంజూరైంది. కౌటాల మండలం కనికి గ్రామం వద్ద అధికారులు భూమిని సైతం పరిశీలించారు. అయినా పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం ఆదిలాబాద్, బెల్లంపల్లిలో కేవీకేలు ఉండగా, శాస్త్రవేత్తలు ఆయా జిల్లాలకే పరిమితమవుతున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం లేకపోవడంతోనే జిల్లాలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం చేపట్టలేదని తెలుస్తోంది. దీంతో చాలామంది రైతులు పాత పద్ధతులతోనే పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని వారు కోరుతున్నారు.


వెనుకబడిపోతున్నాం



రైతులకు తెలిసిన సాగు పద్ధతుల్లోనే పంటలు సాగు చేయడంతో దిగుబడి తగ్గుతోంది. నూతన వంగడాలు, శాస్త్రీయ పద్ధతులపై అవగాహన లేక మెరుగైన దిగుబడులు సాధించడంలో వెనుకబడిపోతున్నాం. జిల్లా పరిస్థితులపై అధ్యయనం చేసి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. వ్యవసాయశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– దాదా గంగారాం, లగ్గాం, మం.దహెగాం

సూచనలు కీలకం



సాగుకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలు అత్యంత కీలకం. జిల్లాలోని రైతుల్లో చాలా మంది నిరక్షరాసులు. వారికి టెక్నాలజీపై అవగాహన లేదు. పంటలకు తెగుళ్లు సోకితే షాపుల యజమానులు చెప్పిన మందులపైనే ఆధారపడుతున్నారు. విత్తనాల ఎంపికపై అవగాహన ఉండటం లేదు. జిల్లాలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు వంటి కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం సరికాదు.

– రఘోత్తంరెడ్డి, రైతు, దహెగాం

ముగిసిన విత్తన పూజలు

మర్రిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



భేటింగ్ అవుతున్న మహిళలు



మహారాష్ట్ర భక్తుల సందడి



పోచమ్మ ఆలయం వద్ద సంప్రదాయ నృత్యాలు



ఆదివాసీల దైవక్షేత్రం జంగుబాయి అమ్మవారి చెంత విత్తన పూజలు ముగిశాయి. కెరమెరి మండలంలోని అటవీ ప్రాంతంలో గల జంగుబాయి అమ్మవారి ఆలయం వద్ద ఈ నెల 1న ప్రారంభమైన పూజోత్సవం శుక్రవారం వరకు కనుల పండువగా కొనసాగింది. మర్రిచెట్టు, పోచమ్మ, రావుడ్, మైసమ్మ వద్ద జిల్లాతోపాటు తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 150 మేళంలు అమ్మవారిని దర్శించుకున్నాయని కటోదాలు, ఆలయ కమిటీ సభ్యులు శ్యాంరావు, బాపూరావు తెలిపారు. కప్లె, సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లోని పవిత్ర నదుల నుంచి గంగాజలాన్ని తీసుకువచ్చి శుక్రవారం ఉదయం దేవతల విగ్రహాలను శుద్ధి చేశారు. శుద్ధి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించారు. కాగా, ఈ ఏడాది నీటి ఎద్దడి కారణంగా భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. - కెరమెరి

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కౌటాల(సిర్పూర్): రైతులు పండించిన వరి పంట చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేపడతామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కౌటాల మండలం సాండ్‌గాం, వీరవెల్లి, సిర్పూర్(టి) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండకుండా వెంటనే కొనుగోలు చేయాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో గోనె సంచులు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని, రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మిల్లులకు వచ్చిన వాహనాల నుంచి ధాన్యాన్ని తక్షణమే దిగుమతి చేసుకుని వాహనాలను తిరిగి పంపించాలన్నారు. కొనుగోళ్లు, తరలింపు ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీఆర్‌డీవో దత్తారావు, జిల్లా సహకార సంఘం అధికారి బిక్కు, తహసీల్దార్ ప్రమోద్, ఏపీఎం ముక్తేశ్వర్, నిర్వాహకులు ఉన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన 'పాల్వాయి'



బండి సంజయ్‌తో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్(సిర్పూర్): సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను వారి అధికారిక నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కేంద్ర నిధుల విడుదల, మౌలిక వసతుల విస్తరణ, రోడ్లు, రైల్వే, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి, అధికార ప్రతినిధులు రాణి రుద్రమ, సోలంకి శ్రీనివాస్ ఉన్నారు.


కలెక్టరేట్ ఎదుట 'ఉపాధి' కూలీల ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, కూలీలు

ఆసిఫాబాద్‌అర్బన్: సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఉపాధిహామీ కూలీలు ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో కనీస సదుపాయాలు కల్పించాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, కూలీల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. వేసవి భత్యం చెల్లించాలని, పనిముట్లు అందించాలని, ఖాళీలు ఉన్న చోట సీనియర్ మేట్లను ఎఫ్‌ఏలుగా నియమించాలన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న డీఆర్‌డీవో దత్తారావు కూలీలకు వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కింది స్థాయి అధికారులకు ఇప్పటికే మెమోలు జారీ చేశామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బిల్లులు చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం కూలీలు అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, టీకానంద్, అశోక్, శ్రీనివాస్, బక్కన్న, తిరుపతి, శ్రీకాంత్, స్రవంతి, రాజ్‌కుమార్, సందీప్, శంకర్, లక్ష్మి, గంగుబాయి, వసంతరావ్ పాల్గొన్నారు.

ఆదిమ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిమ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని తుడుందెబ్బ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోచయ్య డిమాండ్ చేశారు. అదిమగిరిజన భూరక్షణ పోరాట సమితి, రాజ్‌గోండ్ సేవా సమితి, గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల నిర్మాణానికి అటవీ అనుమతులు ఇవ్వాలన్నారు. అటవీ హక్కు పత్రాలు ఉన్న భూయజమానుల వివరాలు భూభారతి పోర్టల్ నమోదు చేసి బ్యాంకుల నుంచి రుణాలందించాలన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించి గిరి వికాస్ పథకం కింద బోర్లు, బావులు వేయించాలని కోరారు. పోడు రైతుల మరణం తర్వాత వారసులకు ఇబ్బందులు లేకుండా వారసత్వ పట్టాలు చేయించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీలు సాగు చేస్తున్న భూముల్లో చెట్లు, కందకాల తవ్వకం నిలిచివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సమస్యలు పరిష్కరించేంత వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. నాయకులు మడావి శ్రీనివాస్, నర్సింగ్‌రావ్, చందన్‌షా, పెందూర్ సుధాకర్, సిడాం అర్జుమాస్టర్, ఆదివాసీలు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పెంపు

ఆసిఫాబాద్‌రూరల్: 2024– 25 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునే గడువు జూన్ 30 వరకు పెంచినట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునేలా కళాశాలల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత స్కాలర్‌షిప్ హార్డ్ కాపీని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

రారండోయ్.. సర్కారు బడికి

- 'బడిబాట'కు విద్యాశాఖ సన్నద్ధం
- జూన్ 6 నుంచి 19 వరకు కార్యక్రమాలు
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపే లక్ష్యం



సుర్దాపూర్‌లో బడిబాట అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో 2025– 26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా విద్యాశాఖ బడిబాట కార్యక్రమం నిర్వహించేందుకు సన్నద్ధమైంది. జూన్ 6 నుంచి 19 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉపాధ్యాయులు జూన్ 6 నుంచి బడి బయట ఉన్న బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించనున్నారు. సర్కారు స్కూళ్లు సాధించిన ప్రగతి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, గుణాత్మక విద్యాబోధన అంశాలను ప్రచార అస్త్రాలుగా వినియోగించనున్నారు.

ఉపాధ్యాయులు సన్నద్ధం

గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య జయశంకర్ 'బడిబాట' పేరిట జూన్ 3 నుంచి 11 వరకు, పాఠశాలల పునఃప్రారంభం నుంచి జూన్ 12 నుంచి 19 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ఈసారి మాత్రం జూన్ 6 నుంచి 19 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాలోని ఉపాధ్యాయులను సైతం సన్నద్ధం చేశారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచేందుకు ఇటీవల ఆయా మండలాల్లో ఉపాధ్యాయులకు నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. మండల విద్యాధికారులకు హైదరాబాద్‌లో సోమవారం నుంచి శిక్షణ కొనసాగుతోంది.

సర్కారు స్కూళ్లపై నమ్మకం పెంచేలా..

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 1,263 ఉన్నాయి. ఇందులో స్థానిక సంస్థల కింద నడిచే ప్రభుత్వ పాఠశాలలు 720 ఉన్నాయి. జిల్లాలో మొత్తం విద్యార్థులు 84,855 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల కంటే 20 శాతం పెంచాలన్నదే లక్ష్యం. దీనికోసం సర్కారు పాఠశాలలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి నమ్మకం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉంది. నాణ్యమైన విద్య అందిస్తున్న తీరును వివరించడంతోపాటు బోధన సదుపాయాలు, సాధించిన ఫలితాల గురించి తెలియజేయనున్నారు. జిల్లాలోని ఎనిమిది పాఠశాల్లో ఏఐ క్లాసులు కొనసాగుతుండగా.. జూన్ నుంచి మరిన్ని పాఠశాలల్లో విస్తరించనున్నారు.

విజయవంతం చేద్దాం

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల పోటీని తట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని అందరి సమన్వయంతో విజయవంతం చేద్దాం. ఇటీవల శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో అమలు చేయాలి. షెడ్యూల్ వారీగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలి.

– యాదయ్య, డీఈవో

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

- 6న స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ గ్రామసభ నిర్వహించాలి.
- 7న ఉపాధ్యాయులు ప్రతీ ఇంటిని సందర్శించి బడీడు పిల్లలను గుర్తించాలి.
- 8, 9, 10 తేదీల్లో ఇంటింటికీ కరపత్రాలతో ప్రచారం చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతో పాటు ప్రత్యేకావసరాలు గల పిల్లలను గుర్తించి అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి.
- 11న కార్యక్రమాలపై సమీక్షించుకోవాలి.
- 12న పాఠశాలలను అలంకరించి పండుగ వాతావరణంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు స్వాగతం పలకాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలి. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు ప్రారంభించాలి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం అందించాలి.
- 13న ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులను ఆహ్వానించి సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ నిర్వహించాలి.
- 16న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్‌ఎల్‌ఎన్), లర్నింగ్, ఇంప్రూమెంట్ ప్రోగ్రాం దినోత్సవాన్ని జరుపుకోవాలి. అన్ని తరగతి గదుల్లో సబ్జెక్టుల వారీగా అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన పోస్టర్లు ప్రదర్శించారు. పిల్లలు రూపొందించిన చార్టులతో గదులను అలంకరించాలి. చదవడం, గణిత సంబంధిత అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించాలి.
- 17న సమీకృత విద్యా బాలికా దినోత్సవం నిర్వహించాలి. మైనర్‌వివాహాలు, చిన్నారుల పై వేధింపులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలి.
- 18న తల్లిదండ్రులు, గ్రామస్తులను ఆహ్వానించి తరగతి గదుల డిజిటలీకరణ, ఇతర ఆధునిక సౌకర్యాలను చూపించాలి. మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి.
- 19న బడిబాట ముగింపు సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించాలి.

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

శ్రీరాంపూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో ఉన్న ఏఎస్ఆర్ వైన్స్‌లో ఈ నెల 21న చోరీకి పాల్పడిన నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. వైన్ షాప్ షట్టర్ తాళం పగులగొట్టి రూ.12 వేల నగదు ఎత్తుకెళ్లారని యజమాని రాముల సుగుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం సీసీసీ కార్నర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గోదావరిఖని నుంచి మంచిర్యాల వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న కట్ట అన్సార్ అను మానాస్పదంగా కనిపించగా విచారణలో నిందితుడిగా తేలిందని అన్నారు. అన్సార్, అతడి స్నేహితుడు హేమంత్ చోరీకి పాల్పడ్డారని, హేమంత్ పరారీలో ఉన్నాడని తెలిపారు. అన్సార్ నుంచి రూ.1000 నగదు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్ చేసినట్లు తెలిపారు. సీసీసీ నస్పూర్ పోలీసులను మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీ ఆర్.ప్రకాష్ అభినందించారు.

కల్లు దుకాణం సీజ్


కల్లు దుకాణాన్ని సీజ్ చేసిన పోలీసులు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ ఎక్స్ రోడ్ సమీపంలోని కల్లు దుకాణాన్ని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. కల్లు దుకాణంలో చిన్నపిల్లలతో పనులు చేయిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో పట్టణ పోలీసుల సహాయంతో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారం షాపును సీజ్ చేశారు. కల్లు షాపులలోగానీ, వైన్ షాప్‌లలో గానీ మైనర్లను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఢీకొట్టి వెళ్లిన వాహనం పట్టివేత

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి మదర్ థెరిస్సా పాఠశాల సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని కన్నెపల్లికి చెందిన బోరె మహేష్(32) మృతిచెందిన విషయం తెలిసిందే. అతడిని ఢీకొట్టి తప్పించుకున్న వాహనాన్ని పట్టుకునేందుకు ఎస్సై తహసీనొద్దీన్ రాత్రంతా తమ సిబ్బందితో కలిసి గాలించారు. గూడెం అటవీ చెక్ పోస్టు సమీపంలో సీసీ ఫుటేజీ పరిశీలించగా అశోక్‌లీలాండ్ గూడ్స్ వాహనం ఢీకొట్టినట్లు గుర్తించారు. వాహన నంబరు ఆధారంగా హస్నకొండ సమీపంలో పట్టుకుని దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చారు. వాహన యజమాని, డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామంలో లక్కడి గంగారెడ్డి చెందిన గేదె శుక్రవారం కరెంటు షాక్‌తో మృతిచెందింది. బాధిత రైతు తెలిపిన ప్రకారం.. ఉదయం మేతకు పుస్పూర్ నుంచి నర్సింహానగర్ తండాకు తీసుకెళ్లారు. అప్పటికే విద్యుత్ వైర్లు తెగిపడడంతో ప్రమాదావశాత్తు గేదే వాటికి తగలడంతో గేదె అక్కడికక్కడే మరణించింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. పరిహారం చెల్లించాలని వేడుకున్నాడు.

మంచిర్యాల పాపికొండలు



చుట్టూ ఎత్తయిన గుట్టలు.. గుట్టల మధ్యలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన మొసళ్ల మడుగు ఒకవైపు.. ఆకాశమే హద్దుగా భూమిపై పరుచుకున్న పచ్చదనం మరోవైపు. చూసేందుకు రెండు కళ్లు సరిపోవు. అడవితల్లి ఒడిలో ఏర్పడిన మొసళ్ల మడుగు అందాలు మరో పాపికొండలను తలపిస్తున్నాయి. ప్రకృతి అందాలను పంచుతున్న మొసళ్ల మడుగు మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని శివ్వారంలోనే ఉంది.

- ఆహ్లాదానికి కేరాఫ్‌గా శివ్వారం మొసళ్ల మడుగు
- గుట్టల మధ్య నిత్యం జలకళ
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు
- అడవితల్లి ఒడిలో పరుచుకున్న పచ్చదనం


గుట్టపై వాచ్ టవర్


అభయారణ్యంలో పురాతన గుడి

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని శివ్వారం, అటు పెద్దపల్లి జిల్లా మంథని సమీపంలోని గోదావరి నదిలో ప్రకృతి ఒడిలో ఏర్పడ్డ మొసళ్ల మడుగు పార్వతి బ్యారేజీ–అన్నారం బ్యారేజీ మధ్యలో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో సుమారు 3 కిలోమీటర్ల వెడల్పుతో విస్తరించింది. రెండు వైపులా ఎత్తయిన గుట్టలు, వాటి మధ్యలో తాటిచెట్టంత లోతులో నిత్యం జలకళ సంతరించుకుంటుంది.

కాకతీయుల కాలంలో గుర్తింపు...

శివ్వారం మొసళ్ల అభయారణ్యం చాలా పురాతనమైంది. కాకతీయుల కాలంలో 1978లో పుష్పకుమార్ అనే వైల్డ్‌లైఫ్ నిపుణుడు ఇక్కడి ప్రాంతాన్ని సందర్శించాడు. అభయారణ్యాన్ని తలపించిన ఈ ప్రాంత వైవిధ్యాన్ని, మడుగులో ఉన్న జీవజాలంపై సమగ్రంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించడంతో మొసళ్ల పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేయడం విశేషం. తాటిచెట్టంత లోతులో సుమారు 20 మీటర్ల మేరకు నీళ్లు ఉండే మడుగులో అనేక రకాల జల, ఉభయచర జీవులకు ఆవాసంగా మారింది. సుమారు 30కి పైగా మొసళ్లు, 100కు పైగా నీటి కుక్కలు, దొనచేపలు, నక్షత్ర తాబేళ్లు, స్టార్‌ఫిష్‌లతో పాటు రకరకాల చేపలు, నీటి జంతువులు మడుగులో నివాసం ఉంటున్నాయి.

ఇలా చేరుకోవాలి..

మంచిర్యాల ఆర్టీసీ బస్టాండు నుంచి జైపూర్, శివ్వారం మీదుగా చెన్నూర్‌కు బస్సు వెళ్తుంది. జైపూర్ నుంచి 20 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఇటు చెన్నూర్, అటు మంథని నుంచి పార్వతి బ్యారేజీ మీదుగా శివ్వారం చేరుకోవచ్చు. ప్రైవేట్ వాహనాల ద్వారా కూడా ఇక్కడికి రావచ్చు. శివ్వారం నుంచి రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే మొసళ్ల మడుగుకు చేరుకోవచ్చు.

దినదినం అభివృద్ధి..

కాకతీయుల కాలంలో గుర్తింపు పొందిన మొసళ్ల మడుగు దినదినం అభివృద్ధి చెందుతోంది. ఒక్కప్పుడు శివ్వారం మొసళ్ల అభయారణ్యం విశిష్టత ఇక్కడి ప్రజానీకానికి తప్ప మరెవరికీ తెలిసేదు కాదు. అటవీశాఖ మొసళ్ల మడుగుపై ప్రత్యేక దృష్టి సారించడంతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. పర్యాటకుల సౌకర్యార్థం మడుగు అందాలను వీక్షించడానికి గుట్టపై ఎత్తు ప్రాంతంలో వాచ్ టవర్ నిర్మించారు. పర్యాటకులు మడుగులో బోటింగ్ చేయడానికి బోటు ఏర్పాటు చేశారు. మడుగు ఒడ్డున రెండు గుట్టలకు మధ్యలో ఎవరెస్టు శిఖరం మాదిరిగా గుట్టలు ఎక్కేందుకు వీలుగా ట్రెకింగ్ ఏర్పాటు చేశారు. ఎత్తయిన రెండు గుట్టలకు మధ్యలో ఒకగుట్ట నుంచి మరో గుట్టపైకి ఎక్కడానికి సుమారు 2.2 రెండు కిలో మీటర్ల దూరంలో ట్రెకింగ్ ఏర్పాటు చేశారు.

బాసరకు పోటెత్తిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిన ఆలయం


అక్షరాభ్యాస పూజల్లో భక్తులు

బాసర: బాసరలో చదువుల తల్లి శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మరికొన్ని రోజుల్లో విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. దీంతో అమ్మవారి దర్శనానికి వారం రోజులు గా భక్తులు భారీగా వస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవారి ని దర్శించుకుని చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయిస్తున్నారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన భక్తులు వేకువజామున గోదావరిలో పుణ్యస్నానాలు చేసి శ్రీమహాలక్ష్మి, శ్రీసరస్వతి, శ్రీమహాకాళి అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్షరాభ్యాస మండపంలో ఆలయ అర్చకులు అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు జరిపించారు. రూ.1000 అక్షరాభ్యాస టికెట్లు 255, రూ.150 అక్షరాభ్యాస టికెట్లు 650 విక్రయించా రు. ఇతర అర్జిత సేవల ద్వారా మొత్తం రూ. 8.70 లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అటవీ అధికారులపై కేసులు పెట్టాలి


డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏమాజీ, రైతులు

బెల్లంపల్లి: పేద దళిత రైతులపై దాడులు చేస్తున్న అటవీ అధికారులపై కేసులు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధిత రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులు సర్వే నంబర్ 65, 67లో ఉన్న భూములను ఐదు దశాబ్దాల నుంచి సాగు చేసి జీవిస్తున్నారని తెలిపారు. అటవీ అధికారులు అడ్డుతగులుతూ దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం డీఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బి.కేశవరెడ్డి, రైతులు బానయ్య, లింగయ్య, సతీష్, రాజయ్య, పర్వతాలు, మహిళలు పాల్గొన్నారు.

మాంత్రికుడి అరెస్ట్


నిందితుడు అభినయ్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళను మంత్రపూజల ద్వారా నయం చేస్తానని ఆమెపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళకు అనారోగ్య సమస్య ఉండడంతో కుటుంబ సభ్యులు ఓ వ్యక్తి సలహా మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా సార్థానికి చెందిన అభినయ్‌కుమారన్ను పిలిపించారు. అభినయ్‌కుమార్ గురువారం రాత్రి పూజల పేరిట మహిళను గదిలోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు మహిళ కేకలు వేయగా కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు అభినయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. బాధిత మహిళకు అవసరమైన వైద్య, మానసిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ స్వాధీనం


కమ్యూనిటీ హాల్‌కు తాళం వేయిస్తున్న ఆర్డీవో

బెల్లంపల్లి: ప్రైవేటు వ్యాపారులకు ఉపయోగపడుతున్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. శుక్రవారం దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ పరాధీనమైన విషయాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్డీవో హరికృష్ణ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఇతరుల స్వప్రయోజనాలకు ఉపయోగపడుతున్న హాల్‌కు తాళం వేయించి తాళంచెవిని మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించారు. హాల్ పరిసరాల్లో కంకర, ఇటుక, ఇసుక డంప్ చేసిన కాంట్రాక్టర్‌ను పిలిపించి వెంటనే తొలగించాలని ఆర్డీవో ఆదేశించారు. ఎమ్మెల్యే వినోద్‌కు దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు కుంబాల రాజేష్, బందెల మురళి, కే.రాజలింగు, కే.రాజం, కుమార్, సతీష్, ఆకాష్, కిరణ్, నరేష్, మహేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమావేశానికి మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు, ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్లుగా ఆర్.నారాయణరెడ్డి, గడ్డం జగన్నాథం, కేవీ ప్రతాప్, జి.భీమ్లానాయక్, అధ్యక్షుడిగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కె.భాస్కర్, బి.గోవర్ధన్ రెడ్డి, జి.ఈశ్వర్, వి.మహేందర్, మారిన శృతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.తిరుపతి, కోశాధికారిగా యు.శంకర్, సంయుక్త కార్యదర్శులుగా మారిన వెంకటేశ్వర్లు, ఆర్.గోపాల్, సాంబశివరావు, ఎల్.హరిలాల్, అంకం సరిత, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.భానయ్య, కార్యవర్గ సభ్యులుగా మారిన చందర్, గుజ్జ మల్లేశ్, ఆర్‌వీ రామకృష్ణ, కె.మల్లేష్, సతీష్, రెడ్డి సతీష్, జి.శ్రీధర్, పి.శ్రీనివాస్, ఏ.జ్యోతి, జి.వెంకన్న, క్రాంతికుమార్, శరత్‌యాదవ్, సలహాదారులుగా ఎం.లక్ష్మణ్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, పి.సాంబయ్య, సదానందం, వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

కేసులకు భయపడేది లేదు..

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- బాధితుడికి పరామర్శ


కందుల ప్రశాంత్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్సీ కవిత

శ్రీరాంపూర్: కాంగ్రెస్ సర్కార్‌లో అక్రమ కేసులను భయపడేది లేదని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. శుక్రవారం ఆమె నస్పూర్‌లో పర్యటించారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు కందుల ప్రశాంత్‌పై ఇటీవల సీసీసీ నస్పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఊరు శ్రీరాంపూర్‌లోని ఆయన నివాసానికి ఆమె వెళ్లి అతడితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్రమ కేసులకు భయపడవద్దని, పార్టీ, తాను అండగా ఉంటామని చెప్పారు. కేసులతో జాగృతి నాయకులు, కార్యకర్తలను బెదిరించలేరని, తాను ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. అనంతరం నస్పూర్ కాలనీలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఊరు శ్రీరాంపూర్ వద్ద కవితను అభిమానులు గజమాలతో సత్కరించగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు కందుల ప్రశాంత్, సింగరేణి జాగృతి శ్రీరాంపూర్ కన్వీనర్ కుర్మ వికాస్, కార్యకర్తలు రత్నాకర్‌రెడ్డి, తొంగల రమేష్, వినయ్ పాల్గొన్నారు.

జర్నలిస్టు మునీర్ కుటుంబానికి పరామర్శ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎండి.మునీర్ గత శనివారం మృతిచెందగా.. శుక్రవారం ఆయన నివాసంలో మునీర్ భార్య రిజ్వానా, కుమారుడు మయూర్, కూతుళ్లు ముజిబా, రేష్మా, తస్వీర్ గౌసియా, తమ్ముళ్లు సందాని, మొహియొద్దీన్లను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునీర్ తెలంగాణ ఉద్యమానికి చాలా కృషి చేశారని అన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు బ్రహ్మానందం పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: ఎమ్మెల్సీ కవిత శుక్రవారం మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యంలో లక్సెట్టిపేట పట్టణంలో ఆగారు. పట్టణానికి చెందిన జాగృతి నాయకురాలు నిషా, విశ్రాంత ఉద్యోగి విజయసారథి ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జన్నారం మాజీ జెడ్పీటీసీ ఎర్రం చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల దూరం..

కవిత పర్యటనకు బీఆర్ఎస్‌తోపాటు టీబీజీకేఎస్ నేతలు దూరంగా ఉన్నారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న ఆమె సింగరేణి క్షేత్రంలో పర్యటించిన సందర్భంలో నేతలెవ్వరూ హాజరు కాలేదు. కనీసం మర్యాద పూర్వకంగానూ కలువకపోవడం సింగరేణిలో తీవ్ర చర్చనీయాశంగా మారింది. గతంలో ఆమె సింగరేణి ప్రాంతాల్లో పర్యటించినప్పుడు కార్మికులు, కార్మిక నేతలతో పెద్ద కాన్వాయ్ వెంట ఉండేది. నేతల హడావిడి చెప్పనక్కర్లేదు. కానీ నేడు ఎలాంటి హంగు ఆర్భాటాలు కనిపించలేదు. పార్టీపై ఆమె చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో దూరంగా ఉన్నారా అన్న చర్చ జరుగుతోంది.

మేకను కాపాడబోయి..

- బావిలో చిక్కుకున్న కాపరి


బావిలో మేకల కాపరి

బోథ్: మేకను కాపాడబోయి కాపరి బావిలో చిక్కుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన ఓ మేకల కాపరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గల వ్యవసాయ క్షేత్రంలో మేకలను మేతకు తీసుకువచ్చాడు. ఈ క్రమంలో వ్యవసాయ క్షేత్రంలోని బావిలో ప్రమాదవశాత్తు ఓ మేక పడిపోయింది. గమనించిన కాపరి మేకను కాపాడాలని బావిలోకి దిగాడు. తనకు తోడుగా వచ్చిన వ్యక్తి బావి బయట ఉండడంతో మేకను తాడు సాయంతో పైకి పంపించాడు. ఆ తర్వాత అతనూ పైకి రావడానికి నానా ఇబ్బందులు పడ్డాడు. స్థానికులు గమనించి అతడిని అతికష్టం మీద బయటకు తీశారు. విషయం తెలుసుకుని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇచ్చోడ నుంచి ఫైరింజన్ కూడా వచ్చింది. అప్పటికే కాపరి బావి నుంచి బయటకు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ కోసం పోలీసుల గాలింపు?

- ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో కేసు నమోదు
- పోలీస్ విచారణకు హాజరుకాని అధికారి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో మున్సిపల్ భూమిని ఓ వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేయగా మున్సిపల్ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో కబ్జాకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో పోలీసులు విచారణ చేపట్టారు. కబ్జా చేసిన వ్యక్తి పోలీసులకు వివరాలు వెల్లడించినట్లు సమాచారం. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జాదవ్‌కృష్ణ ఇదివరకు ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్వోగా పనిచేశారు. ఆ సమయంలో ఫీల్డ్ విజిట్ చేసి ఇచ్చిన ధ్రువీకరణతో మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్ కేటాయించారు. దీంతో వారు మ్యుటేషన్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉందనే కోణంలో పోలీసులు విచారణ జరిపారు. మున్సిపల్ కమిషనర్‌కు పోలీసులు లేఖ రాశారు. దీంతో ఆ సమయంలో రెవెన్యూ ఆఫీసర్‌గా జాదవ్‌కృష్ణ ఫీల్డ్ విజిట్ చేసినట్లు నిర్ధారించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ స్థలంగా తప్పుడు నివేదిక అందించిన సదరు అధికారిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పలుసార్లు కృష్ణను పోలీసులు దర్యాప్తునకు పిలవగా, హాజరు కాకుండా తప్పించుకు తిరిగాడు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో ఆయన అందుబాటులో లేకుండా పోయినట్లు సమాచారం. విధులకు గైర్హాజరు కావడంతో నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చెట్టు పైనుంచి పడి గాయాలు

కడెం: మండలంలోని దోస్త్‌నగర్ గ్రామానికి చెందిన బూద దేవయ్య శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గా యపడ్డాడు. మేక ల మేత కోసం చెట్టు ఎక్కిన దేవ య్య పట్టు తప్పడంతో కిందపడ్డాడు. కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జగిత్యాల ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఖలీల్ అహ్మద్ (46) పంజాబ్ చౌక్ నుంచి రైల్వేస్టేషన్ వైపు ఆటోలో వెళ్తున్నాడు. ఆ సమయంలో పంజాబ్ చౌక్‌లో రోడ్డుపై ట్రాక్టర్ నిలిపి ఉంది. ఆ ట్రాక్టర్ ముందుకెళ్తున్నట్లు గమనించిన ఆటో డ్రైవర్ టర్న్ చేశాడు. ఈ క్రమంలో ఆయన తల ట్రాక్టర్ వెనుక భాగానికి తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సునీల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ముగ్గురికి గాయాలు


గాయపడిన దినేష్, లావణ్య

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుప్యా తండాకు చెందిన లావణ్య, ఆమె భర్త రాథోడ్ దినేష్ ద్విచక్ర వాహనంపై పెట్రోల్ బంకులో పెట్రోలు పోయించుకుని తిరిగి నిర్మల్‌వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో అతివేగంగా సారంగాపూర్ వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భూమేశ్ వారి వాహనాన్ని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో లావణ్య, దినేష్‌కు స్వల్ప గాయాలు కాగా భూమేష్‌కు తలకు గాయమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఒప్పందాలు అమలు చేయాలి


ఎస్టీపీపీ ఈడీకి వినతిపత్రం అందజేస్తున్న సత్తయ్య, బీఎంఎస్ నాయకులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై పలు దఫాలుగా హైదరాబాద్‌లో డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ వద్ద యాజమాన్యం అంగీకరించిన ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులుకు శుక్రవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం బీఎంఎస్ అనుబంధ ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ దుస్స భాస్కర్‌తో కలిసి మాట్లాడారు. ఒప్పందం ప్రకారం క్యాంటీన్ సదుపాయం కల్పించినా సబ్సిడీ ధరపై కొనసాగించాలని తెలిపారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించినప్పటికీ విద్యార్హతకు తగిన ఉద్యోగాలు ఇవ్వాలని, ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రతీ కార్మికుడికి రూ.5వేల అలవెన్సు అదనంగా చెల్లించాలని, క్యాజువల్ లీవ్, సిక్, వేతన లీవ్, ఫ్లైడేలు పీహెచ్‌డీలు చెల్లించే మాదిరిగా చూడాలని కోరారు.

● స్మరణ


కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సభలో గూగీ

ఆ అక్షరం అమ్మ గోరుముద్ద

స్త్రీ హృదయం, ఉద్యమం తెలిసిన మహా రచయిత గూగీ వా థియాంగో. గూగీని అక్షర ప్రపంచంలోకి తీసుకువచ్చింది... మహిళ. అతడి అక్షర బలానికి ఇంధనం... మహిళా చైతన్యం...

అమ్మ లేకపోతే 'గూగీ' ప్రపంచ సాహిత్యానికి పరిచయం కాకపోయేవారేమో! 'నాయనా... నాకు అక్షరం ముక్క రాదు. ఏంచేస్తావో, ఎలా చేస్తావో... నువ్వు మాత్రం బాగా చదువుకోవాలి' అని ఎప్పుడూ అంటూ ఉండేది. 'అమ్మ కోరుకున్నట్లే బాగా చదువుకున్నాను. మంచి స్థితిలో ఉన్నాను' అని సంతృప్తి పడి ఆకాశం వైపు మాత్రమే చూస్తూ కూర్చోలేదు గూగీ. వెనక్కి తిరిగి చూశారు.

'నాయనా... నువ్వు ఇంకా చదువుకోవాలి' అని అమ్మ అడిగినట్లు అనిపించింది. ఈసారి విశ్వ విద్యాలయం చదువులు కాదు తన కెన్యా జాతిజనుల జీవితాలను లోతుగా, మరింత లోతుగా చదివారు. కలానికి పదును పెట్టారు. మూలాలు మరవని గూగీ ప్రపంచ ప్రసిద్ధ రచయిత అయ్యారు.

అమ్మ నా హీరో

'నా హీరోలు ఇద్దరు. ఒకరు జోమో కెన్‌యట్ట. రెండో వ్యక్తి వాన్‌జీకూ' అనేవారు గూగీ. కెన్యన్ ప్రజల కోసం పోరాడిన యోధుడు జోమో కెన్‌యట్ట. రెండో వ్యక్తి గూగీ అమ్మ. వాన్‌జీకూ ప్రసిద్ధ ఉద్యమ నాయకురాలు కాకపోవచ్చు. అయితే ఉద్యమ చైతన్యం ఆమె వ్యక్తిత్వంలో మెరిసిపోయేది. ఆమె విద్యాధికురాలు కాకపోవచ్చు. అయితే ఆమె మాటల్లో, విశ్లేషణల్లో మేధస్సు కనిపించేది. ఆమెకు అక్షరం ముక్క కూడా తెలియదు. అయితే అక్షరం విలువ తెలుసు.

'మా అమ్మకు చదవడం, రాయడం రాదు. అయితే నేను బాగా చదువుకోవాలని కోరుకునేది.



బాగా చదువుకోవాలనే తన కలను నా ద్వారా నిజం చేసుకోవాలనుకునేది' అంటారు గూగీ. గూగీ నాన్నకు నలుగురు భార్యలు. 28 మంది పిల్లలు. వాన్‌జీకూ (గూగీ అమ్మ) మూడో భార్య. తనది రాజ్యహింస బాధిత కుటుంబం అనవచ్చు.

'కెన్యా ల్యాండ్ అండ్ ఫ్రీడమ్ ఆర్మీ'లో పనిచేస్తున్న ఒక సోదరుడు, స్టేట్ ఎమర్జెన్సీ సమయంలో మరో సోదరుడు హత్యకు గురయ్యారు. హోమ్ గార్డ్‌లు(కికుయూ హోంగార్డ్) చేతిలో తల్లి చిత్రహింసలకు గురైంది. గూగీ తొలి నవల 'వీప్, నాట్ చైల్డ్'లో అమ్మ కనిపిస్తుంది. ఇందులో కథానాయకుడి కల... ఎలాంటి పరిస్థితుల్లో అయిన బాగా చదువుకోవాలని. ఎందుకంటే అది తన తల్లి కల.

చిన్న వాళ్లు అయినా... పెద్ద మనసుతో...

'నేను ప్రసిద్ధ రచయితను' అనే అహం గూగీలో కనిపించేది కాదు. తన కంటే వయసులో చాలా చిన్న వాళ్ల నుంచి అయినా నేర్చుకునే, ఆలోచన తీరును మార్చుకునే, అభినందించే మంచి పద్ధతి గూగీలో ఉంది. దీనికి ఉదాహరణ నైజీరియన్ రచయిత్రి చిమమాండా అదిచే. 1977లో పుట్టింది. నాలుగు నవలలు, రెండు చిన్న కథా సంకలనాలు,

ఆమె సలహా ఎప్పుడూ గుర్తుపెట్టుకునేవారు

గ్రామీణుల మాటల్లో విలువైన జీవిత సత్యాలు, అనుసరించదగిన మాటలు ఉంటాయి. అందుకే వారి మాటలు వినడం అంటే గూగీకి ఇష్టం. కెన్యాలో మహిళా రైతు అయిన నెరి వాచాంగ ఇలా అన్నది... 'మరో అయిదు పనులు నీ మీద పడకముందే నీ ముందు ఉన్న అయిదు పనులు పూర్తి చెయ్యి. అలా కాకుండా ఒకేసారి పది పనులు చేయడం ఎంత భారం!' 'వాచాంగ ఇచ్చిన సలహాను పాటిస్తుంటాను. పాటిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. పాటించకపోతేనే ఇబ్బంది' అంటుండేవారు గూగీ.

వ్యాసాల పుస్తకాలు తీసుకువచ్చింది.

ఆమె నవలల్లో ఒకటైన 'హాఫ్ ఆఫ్ ఏ యెల్లో సన్' గూగీకి ఇష్టమైన నవల. నైజీరియన్ అంతర్యుద్ధానికి సంబంధించి తండ్రి చెప్పిన విషయాల ఆధారంగా ఈ నవల రాసింది. 'ఆమె నవలలోని పాత్రల గురించి ఆలోచించకుండా బియాఫ్రాన్ యుద్ధం గురించి ఎప్పుడూ ఆలోచించలేదు' అంటారు గూగీ. అమెరికన్ న్యూస్ టెలివిజన్ ప్రోగ్రాం....రేచల్ మాడో షో(టీఆర్ఎంఎస్). రేచల్ మాడో నిర్వహించే ఈ ప్రోగ్రాం అంటే గూగీకి చాలా ఇష్టం. 'డ్రిఫ్ట్: ది అన్ మోర్నింగ్ ఆఫ్ అమెరికన్ మిలిటరీ పవర్' 'బ్లోఅవుట్: కరప్టెడ్ డెమోక్రసీ' 'బ్యాగ్‌మ్యాన్: ది వైల్డ్‌క్రైమ్స్' 'ప్రీక్వెల్: యాన్ అమెరికన్ ఫైట్ అగేనెస్ట్ ఫాసిజం' పుస్తకాలు రాసింది రేచల్.

'ఎంతటి జటిలమైన విషయాలను అయినా సులభంగా అర్థమయ్యేలా చెప్పడంలో రేచల్ దిట్ట. ఆమె అద్భుతమైన కథకురాలు. రేచల్ ప్రోగ్రామ్‌లో కనిపించాలనేది నా కల' అన్నారు గూగీ.

ఉద్యమ మహిళల గొంతుక

అద్భుత చైతన్యం ఉన్న ఎన్నో తరాల మహిళలను ప్రత్యక్షంగా చూశారు గూగీ. అందుకే ఆయన రచనల్లో పోరాట పటిమ ఉన్న మహిళలు, సామాజిక, రాజకీయ మార్పు కోసం చేసే ఉద్యమాలలో క్రియాశీల పాత్ర పోషించే మహిళలు, పురుషాధిపత్యాన్ని కాలదన్ని తమదైన మార్గంలో నడిచి స్ఫూర్తినిచ్చే మహిళలు ఉంటారు. స్త్రీలపై సాగే దోపిడి, అణచివేతను అక్షరబద్ధం చేశారు గూగీ. కష్టాలు, కన్నీళ్లు మహిళలను ఉద్యమపథంలోకి వెళ్లకుండా అడ్డుపడలేవని తన నవలల ద్వారా చెప్పారు గూగీ.

మిస్ వరల్డ్ 2025



నేడు ఫినాలే
బ్యూటీ కిరీటం ఎవరికి?


మిస్ వరల్డ్ పోటీకి విచ్చేసిన వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు

అందం అంటే ఆత్మవిశ్వాసం..
అందం అంటే ఓ సామాజిక బాధ్యత..
అందం అంటే సాధికారత..
అందం అంటే ఎమోషనల్ బ్యాలెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్..

అనే అందమైన నిర్వచనాలను స్థిరపరుస్తూ సాగుతున్న మిస్ వరల్డ్ పోటీలకు ఈసారి హైదరాబాద్ వేదికైంది! ఈ పోటీలు ఫైనల్‌కి వచ్చాయి.

మిస్ వరల్డ్ కిరీటం ఎవరికి దక్కనుందో తేలేది నేడే! నూటఎనిమిది దేశాలకు చెందిన సుందరీమణులు పోటీ పడుతున్న ఆ బ్యూటీ పాజెంట్ ఫైనల్ ఎలా ఉండబోతోంది, మిస్ వరల్డ్‌గా ఎంపికైన సుందరి ఏడాదంతా ఏం చేస్తుంది లాంటివి ఆసక్తిని రేకెత్తిస్తాయి.

హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో సాయంత్రం ఆరున్నరకు మొదలవనున్న మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే వేడుకను మిస్ వరల్డ్ 2016 స్టెఫనీ డెల్ బాయే (Stephanie del valle), యాంకర్, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ సచిన్ కుంభార్.. ఇద్దరూ కలిసి హోస్ట్ చేస్తున్నారు.

ఎంపిక ఇలా..

ముందుగా 108 దేశాల సుందరీమణులు వేదిక మీదికి వస్తారు. అమెరికా- కరిబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా- ఓషియానియాల నుంచి ఖండానికి పది మంది చొప్పున మొత్తం నలభై మందిని క్వార్టర్ ఫైనల్‌కిసెలెక్ట్ చేస్తారు. అయితే ఇప్పటికే రకరకాల పోటీల్లో ఈ నాలుగు ఖండాల నుంచి పద్దెనిమిది మంది క్వార్టర్ ఫైనల్‌కి చేరుకున్నారు. మిగిలినవారిని పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా సెలెక్ట్ చేసిన జ్యూరీ ఈ రోజు వాళ్ల పేర్లను ప్రకటించి వేదిక మీదికి ఆహ్వానిస్తుంది. ఈ నలభై మంది లోంచి ప్రతి ఖండానికి టాప్ ఫైవ్ చొప్పున, మళ్లీ అందులోంచి ప్రతి ఖండానికి టాప్ 2 లెక్కన సెలెక్ట్ చేస్తారు.


● ఐశ్వర్యా రాయ్


● ప్రియాంకా చోప్రా


● రీటా ఫారియా


● హెలెన్ మోర్గన్

ఫైనల్‌గా..

ఫైనల్‌రౌండ్ వచ్చేసరికి మొత్తం నలుగురు మాత్రమే మిగులుతారు. ఈ నలుగురిని జ్యూరీ ఓ ప్రశ్న అడుగుతుంది. ఆ జవాబును బట్టి మిస్ వరల్డ్‌ను ఎంపిక చేస్తారు. విజేతకు కిందటేడు మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా అందాల కిరీటాన్ని తొడుగుతుంది. జ్యూరీలో నటుడు సోనూ సూద్, సుధారెడ్డి, మిస్ ఇంగ్లండ్ 2014 డాక్టర్ కెరీనా టరెల్, మిస్ వరల్డ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లే సభ్యులుగా ఉంటారు.

గెలిచిన తర్వాత..

మిస్ వరల్డ్ టైటిల్ విజేత తన దేశం తరపున ప్రపంచవ్యాప్త సాంస్కృతిక కార్యక్రమాలు, అధికారిక వేడుకలు, సంబరాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. పలు చారిటీ ప్రోగ్రామ్స్, ప్రాజెక్ట్స్‌లో పాల్గొంటుంది. మిస్ వరల్డ్ సంస్థ తరపున ప్రపంచ యాత్ర చేస్తూ ఆ సంస్థ లక్ష్యాలను ప్రచారం చేస్తుంది. అక్షరాస్యత, పలు సామాజిక అంశాల అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

ఇంకా...

● మిస్ వరల్డ్ విజేతకు తొడిగే అందాల కిరీటం ధర రూ. 85 లక్షల పైచిలుకే! 18 క్యారట్ల గోల్డ్‌తో చేసిన ఆ కిరీటం మధ్యలో 62.83 క్యారట్ల డైమండ్ చుట్టూ 1770 చిన్న చిన్న డైమండ్స్ పొదిగి ఉంటాయి. వాటన్నిటి బరువు 175.49 క్యారట్లుంటాయి. దీన్ని ఆ విజేత ముఖ్యమైన ఈవెంట్స్‌లో మాత్రమే ధరిస్తుంది. ప్రపంచ యాత్రలో అసలైన కిరీటాన్ని పెట్టుకోదు. మిస్ వరల్డ్ విజయానికి చిహ్నంగా విజేతకు రెప్లికా క్రౌన్‌ను ఇస్తారు. అసలు కిరీటం మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ దగ్గరే ఉంటుంది. ఈ పోటీలకు వయోపరిమితి 17 ఏళ్ల నుంచి 27 ఏళ్లు.

● టర్మ్ అవకముందే మిస్ వరల్డ్ హోదాకు రాజీనామా చేసిన తొలి మిస్ వరల్డ్ 1974 సంవత్సర విజేత హెలెన్ మోర్గన్. టైటిల్ గెలిచిన నాలుగు రోజులకు ఆమె ఏడాదిన్నర బిడ్డకు తల్లి అని తెలిసిందట. మిస్ వరల్డ్ పోటీల్లో అవివాహితలు మాత్రమే పాల్గొనాలనే నియమాన్ని ఉల్లంఘించినందువల్ల ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది.

● అమెరికా – వియత్నాం యుద్ధంలో అప్పటి మన ప్రభుత్వం వియత్నాం పక్షాన నిలబడింది. దీనికి విరుద్ధంగా మన తొలి మిస్ వరల్డ్ రీటా ఫారియా అమెరికన్ ఎంటర్‌టైనర్ బాబ్ హోప్‌తో కలిసి అమెరికా సైనికులను ఎంటర్‌టైన్ చేసిందని ఆమె చర్య పట్ల అప్పుడు మన ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది.

● మిస్ వరల్డ్ పోటీలు మొదలైన నాటి (1951) నుంచి ఈరోజు దాకా మన దేశం ఆరుసార్లు కిరీటాన్ని గెలిచి రికార్డ్ సృష్టించింది.


● డయానా హెడెన్

● విజేతల్లో ఐశ్వర్యా రాయ్‌ను మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ మోస్ట్ సక్సెస్‌ఫుల్ మిస్ వరల్డ్‌గా చెబుతుంటారు.

● ఫెయిర్‌నెస్ క్రీమ్ ప్రకటనలకు నో చెప్పిన తొలి మిస్ వరల్డ్‌గా డయానా హెడెన్ (మిస్ వరల్డ్ 1997)ను ప్రస్తావిస్తారు. 'నా ఒంటి రంగు పట్ల నాకెలాంటి రిగ్రెట్స్ లేవు. ఛాయ తక్కువగా ఉండటాన్ని నేను ఆత్మన్యూనతగా ఎప్పుడూ భావించలేదు. ఆ స్కిన్‌టోన్‌తోనే నేను మిస్ వరల్డ్‌గా గెలిచాను. నా దృష్టిలో ఆత్మవిశ్వాసమే అసలైన అందం. కాబట్టి దాన్నే ప్రమోట్ చేస్తాను ఫెయిర్‌నెస్ క్రీమ్స్‌ని కాదు' అని చెప్పింది డయానా.

● అందాల పోటీల్లో చమత్కారం, సునిశిత దృష్టి గల జవాబులకు ప్రియాంక చోప్రా పెట్టింది పేరుగా ఖ్యాతినార్జించింది.

– సరస్వతి రమ
ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

బులియన్ 30న ముగింపు రూ.లలో
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

హైదరాబాద్		**రాజమండ్రి**	
బంగారం (24 క్యారెట్లు)	96,110	బంగారం (24 క్యారెట్లు)	98,140
బంగారం (22 క్యారెట్లు)	89,430	బంగారం (22 క్యారెట్లు)	91,880
వెండి	99,000	వెండి	99,500
విజయవాడ		**ప్రొద్దుటూరు**	
బంగారం (24 క్యారెట్లు)	98,140	బంగారం (24 క్యారెట్లు)	95,600
బంగారం (22 క్యారెట్లు)	89,200	బంగారం (22 క్యారెట్లు)	87,950
వెండి	99,500	వెండి	98,700
విశాఖపట్నం		**చెన్నై**	
బంగారం (24 క్యారెట్లు)	97,310	బంగారం (24 క్యారెట్లు)	97,300
బంగారం (22 క్యారెట్లు)	89,200	బంగారం (22 క్యారెట్లు)	89,200
వెండి	1,10,900	వెండి	1,11,000

● కిచెన్ టిప్స్



మిగిలిపోయిన చపాతీ, బ్రెడ్‌స్లైసులు గట్టిగా అయిపోయి తినడానికి పనికిరావు. వీటిని ప్లేటులో పెట్టి, ఈ ప్లేటులోనే అరగ్లాసు నీటిని కూడా ఉంచి, మైక్రోవేవ్‌లో పదినిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల నీళ్లు ఆవిరిగా మారి చపాతి, బ్రెడ్‌స్లైసులు మెత్తబడి, అప్పుడే చేసినవాటిలా తాజాగా ఉండి, తినడానికి పనికొస్తాయి.



● వేపుడు కూరలు వండేటప్పుడు టీస్పూను వెనిగర్ వేస్తే కూర అంతగా నూనె పీల్చుకోదు.

● సన్నని మంట మీద యాపిల్ తొక్కలు మరిగించిన నీటితో అల్యూమినియం పాత్రలను తోమితే మొండి మరకలు ఇట్టే పోతాయి.

వంటిల్లు

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పుట్టగొడుగులతో కేవలం కూరలే కాకుండా, రుచికరమైన చిరుతిళ్లు కూడా చేసుకోవచ్చు. నిజానికి మాంసాహారం తినని వారికి ఇవి చక్కటి ప్రత్యామ్నాయం అంటుంటారు చాలామంది. అలాంటి మష్రూమ్‌తో ఈ టేస్టీ స్నాక్స్ మీకోసం...

మ ష్రూ మ్ మే ని యా



మష్రూమ్ బజ్జీ

కావలసినవి: మష్రూమ్స్ – ఒక కప్పు (శుభ్రం చేసుకుని పెట్టుకోవాలి); శనగపిండి – ఒక కప్పు; బియ్యప్పిండి – 2 టేబుల్ స్పూన్లు; మసాలా, అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీ స్పూన్ చొప్పున; కారం, పసుపు, వాము పొడి, ఉప్పు – కొద్దికొద్దిగా; నీరు, నూనె – సరిపడా; వంట సోడా – కొద్దిగా.

తయారీ: ముందుగా శనగపిండి, బియ్యప్పిండి, అల్లం -వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, వాము పొడి, ఉప్పు, వంట సోడా వేసుకుని, తగినంత నీళ్లు పోసుకుంటూ బజ్జీల పిండిలా చిక్కగా కలుపుకోవాలి. అనంతరం ఒక్కో పుట్టగొడుగును శనగపిండి మిశ్రమంలో ముంచి నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి. వేడివేడిగా తింటే భలే రుచిగా ఉంటాయి ఇవి.



మష్రూమ్ పిజ్జాలు

కావలసినవి: పెద్ద పోర్టబెల్లా పుట్టగొడుగులు– 4 (లోపలి భాగం తొలగించి గుంతలా చేసుకోవాలి); టమాటో సాస్ – 3 టేబుల్ స్పూన్స్; మొజారెల్లా చీజ్ తురుము – అర కప్పు; ఆలివ్ ఆయిల్ – ఒక టేబుల్ స్పూన్; వెల్లుల్లి రెబ్బలు – 2 రెబ్బలు (సన్నగా తరిగినవి); ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, మొక్కజొన్న గింజలు, చిల్లీ ఫ్లేక్స్, పుదీనా తురుము, టమాటో ముక్కలు – కొద్దికొద్దిగా (అభిరుచిని బట్టి); ఉప్పు – సరిపడా; మిరియాల పొడి – చిటికెడు.

తయారీ: ముందుగా ఓవెన్‌ను 200 డిగ్రీల సెల్సియస్‌లో ప్రీహీట్ చేసి పెట్టుకోవాలి. పుట్టగొడుగులకు అన్నివైపులా కొద్దిగా ఆలివ్ ఆయిల్ రాసి, బేకింగ్ ట్రేలో ఉంచి, 5 లేదా 7 నిమిషాలు బేక్ చేసి, బయటికి తీసుకోవాలి. ఇప్పుడు ఆ పుట్టగొడుగుల లోపల పిజ్జా సాస్ రాసి, వాటిలో మొజారెల్లా చీజ్‌తో పాటు ఉల్లిపాయ ముక్కలు, టమాటో ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, స్వీట్ కార్న్ (వీటితో పాటు అదనంగా నచ్చినవి జోడించుకోవచ్చు) వంటివి వేసుకోవాలి. మళ్లీ ఓవెన్‌లో పెట్టి, చీజ్ కరిగే వరకూ బేక్ చేసుకుని, వేడి వేడిగా సర్వ్ చేసుకోవచ్చు.



మష్రూమ్ కట్లెట్స్

కావలసినవి: పుట్టగొడుగులు – 200 గ్రాములు; బంగాళాదుంపలు – 4 చిన్నవి (ఉడికించి, తొక్క తీసి మెత్తగా గుజ్జులా చేసుకోవాలి); ఉల్లిపాయ – ఒకటి (చిన్నగా తరగాలి); నూనె – సరిపడా; పచ్చిమిర్చి – ఒకటి (సన్నగా తరగాలి); కొత్తిమీర పొడి – ఒక టేబుల్ స్పూన్; ఇంగువ, పసుపు – అర టీస్పూన్ చొప్పున; జీలకర్ర పొడి – ఒక టేబుల్ స్పూన్; గరం మసాలా పొడి – అర టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – అర కప్పు; శనగ పిండి – 3 టేబుల్ స్పూన్లు; పాలు – 2 టేబుల్ స్పూన్లు; గుడ్డు – ఒకటి; బ్రెడ్ పౌడర్ – కొద్దిగా; ఉప్పు – తగినంత.

తయారీ: ముందుగా పుట్టగొడుగులను శుభ్రం చేసి, తడిలేకుండా తుడిచి, చిన్న ముక్కలుగా కట్ చేసుకుని నూనెలో డీప్ ఫ్రై చేసుకుని పక్కనపెట్టుకోవాలి. అనంతరం పాన్‌లో నూనె వేడి చేసుకుని ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేయించుకోవాలి. తర్వాత ఇంగువ, పుట్టగొడుగు ముక్కలు, పసుపు, కొత్తిమీర తరుగు, గరం మసాలా, జీలకర్ర పొడి వేసి 2–3 నిమిషాలు ఉడికించి, చల్లారనివ్వాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో బంగాళదుంప గుజ్జు, శనగపిండి, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి.

ఇప్పుడు చిన్న చిన్న ఉండలుగా చేసుకుని నచ్చిన షేప్‌లో కట్లెట్స్‌లా ఒత్తుకోవాలి. ఇప్పుడు ఒక చిన్న పాత్రలో గుడ్డు, పాలు వేసి బాగా కలిపి, దానిలో ఈ కట్లెట్స్ ముంచి, బ్రెడ్ పౌడర్ పట్టించి, వాటిని నూనెలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది. వీటిని టమాటో సాస్‌లో ముంచి తింటే భలే రుచిగా ఉంటాయి.

– సన

● నయా వంచన

అయ్ బాబోయ్... ఏఐ వాయిస్ క్లోనింగ్!



ఆరోజు... ముంబైలో ఉండే కేశవ్‌కు ఫోన్‌కాల్ వచ్చింది. దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని సెకన్ల తరువాత... ఫోన్‌లో తన కుమారుడు శ్రీకర్ అరుపులు విని కేశవ్ షాక్ అయ్యాడు. 'దయచేసి నాకు బెయిల్ ఇప్పించండి' ఏడుస్తూనే అంటున్నాడు శ్రీకర్. 'మీరు 80,000 రూపాయలు చెల్లించాలి' అని ఫోన్ చేసిన వాళ్లు కేశవ్‌ను డిమాండ్ చేశారు. ఆ భయంలో, బాధలో ఏమీ తోచని కేశవ్ వారు చెప్పినట్లే చేశాడు. అయితే అది మోసం అని తెలుసుకోవడానికి కేశవ్‌కు ఎంతో టైమ్ పట్టలేదు. తన కుమారుడు సురక్షితంగానే ఉన్నాడు.

మరి వాయిస్ మాటేమిటి?

శ్రీకర్ వాయిస్‌ను అనుసరిస్తూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ వాయిస్ అది. సైబర్ మోసాలలో ఒకటి... ఏఐ వాయిస్ క్లోనింగ్. ప్రజల భావోద్వేగాలను, బలహీనతలను ఆసరాగా చేసుకొని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో మోసం చేస్తున్నారు స్కామర్స్. గత కొంతకాలంగా 'వాయిస్ క్లోనింగ్' ఊపందుకుంది. అయితే విద్యావంతులు, విద్యావంతులు కాని వారు అనే తేడా లేకుండా డెబ్బైశాతం మంది క్లోన్ వాయిస్‌లను గుర్తించలేపోతున్నారు. ఒక వ్యక్తి వాయిస్‌ను క్లోన్ చేయడానికి స్కామర్‌లకు జస్ట్ మూడు సెకన్ల సమయం చాలు.

మోసగాళ్ల బారిన పడకుండా కొన్నిచిట్కాలు

'అయ్యో... నన్ను గుర్తుపట్టలేదా!' అంటూ మోసగాళ్లు మాటలు కలుపుతారు.

'సారీ... గుర్తుపట్టలేదు' అంటే ఏమనుకుంటారో అని మొహమాటం కొద్దీ మాట్లాడడం మొదలుపెడతారు కొందరు. అలా చేస్తే మోసగాళ్లకు అవకాశం ఇచ్చినట్లే.

అందుకే... 'నేను ఫలానా...' అని అవతలి వ్యక్తి చెప్పినప్పుడు మీ ఇద్దరికి మాత్రమే తెలిసిన ఒక విషయం గురించి అడగండి. అతను కరెక్ట్ అని చెబితే ఓకే. కానిపక్షంలో అనుమానించాల్సిందే.

● స్నేహితుడు, బంధువు... మొదలైన వారి పేరుతో వచ్చిన కాల్ చాలా తక్కువ టైమ్ మాత్రమే ఉంటే అది వార్నింగ్ సైన్ అనుకోవచ్చు.

● ఏఐ స్కామ్ వాయిస్‌లు తెలియని నంబర్ నుంచి జరుగుతుంటాయి.

● ఆన్‌లైన్‌లో అపరిచితులకు వాయిస్ నోట్స్, వీడియో షేరింగ్ చేయకూడదు.